క్లుప్తంగా

కొండచీపుర్లకు డిమాండ్



మార్కెట్‌లో ఉన్న కొండచీపుర్లు

సీతంపేట: స్థానిక మార్కెట్‌కు కొండచీపుర్లు భారీగా చేరుకున్నాయి. ఒక్కో చీపురు రూ.45 నుంచి రూ.55 వరకు ధర పలుకుతోంది. గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఈ చీపుర్లను కొనుగోలు చేయకపోవడంతో దళారీలు రంగప్రవేశం చేసి గిరిజనుల నుంచి తక్కువ ధరకు కొండచీపుర్లు కొనుగోలు చేస్తున్నారు. వాటిని మైదాన ప్రాంత మార్కెట్లలో అధిక ధరలకు విక్రయించి లాభాలు పొందుతున్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై



ఆదిమ్మ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: ఎదుటి వారికి కష్టం వస్తే వెంటనే స్పందించి ఆదుకునేవారు కొందరే ఉంటారు. అలాంటి వారిలో పాలకొండ ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ ఒకరు. ఇటీవల ఎస్సైగా వచ్చిన ఆయన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్ని గ్రామాల్లో తిరుగుతూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. పట్టణంలోని వడమ ప్రాంతంలో ఆదివారం పర్యటిస్తుండగా.. అక్కడి కోనేటి గట్టుపై పరదాలతో గూడుకట్టుకని ఒంటరిగా జీవిస్తున్న కరణం ఆదమ్మను గుర్తించారు. వెంటనే తన వాహనం దిగి ఆ వృద్ధురాలి వద్దకు వెళ్లి ఆమె పరిస్థితిని అడిగి తెలుసుకుని చలించిపోయారు. కొంత ఆర్థిక సాయం, తినుబండారాలు, చార్జింగ్ లైట్ అందించారు. ఎస్సై మానవత్వాన్ని అక్కడి వారు ప్రశంసించారు.

ఎమ్మెల్యే పరామర్శ



నారాయణమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: నగరపంచాయతీ 15వ వార్డు పరిధిలో ఇటీవల మరణించిన తులసి నారాయణమ్మ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం పరామర్శించారు. నారాయణమ్మ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రభుత్వం నుంచి అన్ని విధాలా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయవర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ సమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, తదితరులందరూ హాజరుకావాలని కోరారు.

పెద్దూరులో అభివృద్ధి పరుగులు

- నాడు నిర్లక్ష్యం.. నేడు ప్రగతి పథం
- సీసీరోడ్లు, కాలువలు, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణం
- నవరత్నాలతో ప్రతీ ఇంటా సంక్షేమ లబ్ధి

ఇదీ కదా.. అభివృద్ధి

గరుగుబిల్లి: గత టీడీపీ ప్రభుత్వంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి దూరమైన పెద్దూరు గ్రామ పంచాయతీ నేడు అభివృద్ధి పథంలో పయనిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంచాయతీ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో సీసీరోడ్లు, వీధికాలువలు, తాగునీరు, విద్యుత్ వీధి దీపాలు, తదితర మౌలిక వసతులు కల్పించడం జరిగింది. మరోవైపు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. సంక్షేమ పథకాలకు అర్హులైన 2917 మంది లబ్ధిదారులకు ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ) ద్వారా నాలుగున్నరేళ్లలో రూ.8.20 కోట్లు, పరోక్ష నగదు లబ్ధి(నాన్ డీబీటీ) ద్వారా 662 మందికి రూ.1.79 కోట్లు లబ్ధి చేకూరింది. గ్రామంలోని ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందడంతో పాటు ప్రభుత్వ సేవలన్నీ గడప వద్దకే వచ్చి చేరుతుండడంతో ప్రతి ఒక్కరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు

- గతంలో అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్న పెద్దూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఒకే చోట నిర్మించారు.
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు రూ.9 లక్షలతో 306 మీటర్ల మేర సీసీ కాలువల నిర్మాణం చేపడుతున్నారు.
- నాడు-నేడు మొదటి విడత కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.16.35 లక్షలతో మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.
- రూ.15.92 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రం-2 నిర్మాణం జరుగుతోంది.
- గ్రామ పంచాయతీ నిధులతో 465 మీటర్ల సీసీ కాలువలను, 292 మీటర్ల రహదారిని, మండల పరిషత్ నిధులతో 151 మీటర్ల సీసీ కాలువలను నిర్మించారు.
- రూ.3 లక్షలతో మూడు బోరుబావులను నిర్మించారు. గ్రామంలో సీసీ కాలువలు, రహదారులు అందుబాటులోకి రావడంతో పాటు ఆర్‌బీకే కేంద్రం ద్వారా ప్రజలకు సేవలందుతున్నాయి.



నిర్మాణంలో ఉన్న కాలువ

సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలు(డీబీటీ)

పథకం	లబ్ధిదారులు	పథకం	లబ్ధిదారులు
వైఎస్సార్ ఆసరా	284	వైఎస్సార్ కళ్యాణమస్తు	2
అమ్మ ఒడి	273	నేతన్న నేస్తం	7
జగనన్న చేదోడు	32	రైతు భరోసా	416
కోవిడ్ సాయం	210	సున్నావడ్డీ(పంటరుణాలు)	224
హౌసింగ్	1	సున్నావడ్డీ(డ్వాక్రా సంఘాలు)	476
ఇన్‌పుట్ సబ్సిడీ(రైతులు)	48	వైఎస్సార్ వాహనమిత్ర	11
జగనన్న తోడు	23	వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	45
జగనన్న వసతిదీవెన	143	వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	89
జగనన్న విద్యాదీవెన	147	వైఎస్సార్ బీమా	2
		వైఎస్సార్ చేయూత	152
		సామాజిక పింఛన్లు	332
		మొత్తం	2917





నాడు-నేడు కార్యక్రమంలో నిర్మించిన పాఠశాల భవనం



పెద్దూరులో నిర్మించిన రైతుభరోసా కేంద్రం

అభివృద్ధి కళ్లముందు కనిపిస్తోంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌బీకే ద్వారా రైతులకు నిరంతరం సేవలందిస్తున్నారు. 'గడపగడపకు మన ప్రభుత్వం' ద్వారా గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు కేటాయించారు. ఆ నిధులతో గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం.

– తెర్లి ఎల్లంనాయుడు, ఉప సర్పంచ్, పెద్దూరు గ్రామ పంచాయతీ

పథకాలు సక్రమంగా అందుతున్నాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో గ్రామంలో అర్హులకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయి. ఎలాంటి వివక్షత లేకుండా గ్రామ వలంటీర్ల ద్వారా పథకాలను నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్నారు. వృద్ధాప్యంలో ఎవరి మీద ఆధారపడకుండా జీవిస్తున్నాను. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాను.

– టి.సూరపునాయుడు, పింఛన్ లబ్ధిదారు, పెద్దూరు

అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయలేరు

- టీడీపీ, జనసేన నేతల హామీలపై ఎమ్మెల్యే కళావతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ప్రజలను మోసగించేందుకే టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం స్థానిక విలేకర్లతో ఆమె మాట్లాడారు. టీడీపీ, జనసేనలు ఇస్తున్న అబద్ధపు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్నన్ని సంక్షేమ పథకాలు దేశంలోని మరే రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని, ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. శ్రీకృష్ణదేవరాయుల వారి పాలన గూర్చి పురాణాల ద్వారా తెలుసుకున్నామని, నేడు అటువంటి పాలనను సీఎం జగన్ సారథ్యంలో అందుతుంటే కళ్లారా చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కళ్లుండీ చూడలేని ధృతరాష్ట్రులు ప్రతిపక్ష నేతలని దుయ్యబట్టారు. ప్రతిపక్షాలకు 2019 కంటే ఘోర పరాభవం తప్పదన్నారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక, ఆసరా, జగనన్న గోరుముద్ద, జగనన్న హౌసింగ్, ఇంటి వద్దకే రేషన్ బియ్యం, తదితర సంక్షేమ పథకాలతో ప్రతిపక్షాల నోరు మూయించాలని కోరారు. సమావేశంలో సీతంపేట మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సుమిత్రారావు, సవర రాము తదితరులున్నారు.

రూ.30 లక్షలతో అన్నసత్రం నిర్మాణం



అన్నసత్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ఎన్నో ఏళ్లుగా పేద విద్యార్థులకు ఆశ్రయం కల్పించిన బెవర గోపాలనాయుడు అన్నసత్రం అందుబాటులోనికి వచ్చింది. దాతల సహకారంతో నడుస్తున్న ఈ సత్రంలో సరైన భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న సమయంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరుకు కృషిచేశారు. ప్రభుత్వం రూ.24 లక్షలు, నగర పంచాయతీ నిధులు రూ.6 లక్షలు మంజూరు చేయడంతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేశారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం నూతన భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత వైద్యుడు పాలవలస శశిభూషణరావు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ నాయకుడు కొంచాడ శ్రీనివాస్, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, పల్లా భాను, కొరికాన గంగునాయుడు, కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ తూముల లక్ష్మణరావు, పాలవలస ధవళేశ్వరరావు, గుడ్ల గణపతి, దేవాదాయ శాఖ అధికారులు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు

పాలకొండ/పాలకొండ రూరల్: నగరంలో చోరీల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని, పోలీసు బృందాలతో నిఘా ఏర్పాటు చేశామని సీఐ ఎం.చంద్రమౌళి తెలిపారు. పాలకొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వేకువజామున సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్, సీతంపేట, శ్రీకాకుళం-పార్వతీపురం-విశాఖ మార్గాల నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రతిరోజు రాత్రి 11 గంటల నుంచి తనిఖీలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చోరీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానిత వ్యక్తుల కదలికలపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వేసవిలో ఆరుబయట నిద్రించేవారు విలువైన ఆభరణాలు వేసుకుని నిద్రించొద్దని సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు పోలీసులకు ముందుగా తెలియజేస్తే ఇంటి వద్ద గస్తీ పెడతామన్నారు.



పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అర్ధరాత్రి తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ, పోలీసు సిబ్బంది

- గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మండలంలోని ఖడ్గవలస జంక్షన్ వద్ద శనివారం అర్ధరాత్రి చినమేరంగి సీఐ మురళీధర్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, భారీ మొత్తంలో నగదు తరలింపుపై నిఘా పెట్టినట్లు వెల్లడించారు. ఆయన వెంట స్థానిక ఎస్సై అమ్మన్నరావు ఉన్నారు.



గరుగుబిల్లి: ఖడ్గవలస జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న సీఐ మురళీధర్

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీసాయి మందిరంలో ఆదివారం సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, కాకడహారతి, విశేష అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ సహకారంతో అర్చకులు నర్తె నరసింహాచార్యులు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు.

విశ్వబ్రాహ్మణుల సమన్వయ సమావేశం రేపు

వీరఘట్టం: ఈనెల 5న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించే విశ్వబ్రాహ్మణుల సమన్వయ సమావేశాన్ని విజయవంతం చేయాలని విశ్వబ్రాహ్మణ సంఘం స్టేట్ డైరెక్టర్ బూరాడ లక్ష్మీకాంతం ఆదివారం పిలుపునిచ్చారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ నాయకులతో, వైఎస్సార్‌సీపీకి చెందిన ముఖ్యనేతలతో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ పవిత్రా మురళీకృష్ణ సమావేశమవుతారని తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం ముఖ్య నేతలు, క్రియాశీలక సభ్యులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



వీరఘట్టం: శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు పరశురామ్



పాలకొండ రూరల్: శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మహిళకు పింఛను అందిస్తున్న వలంటీరు ధనలక్ష్మి

పాలకొండ/పాలకొండ రూరల్/వీరఘట్టం: లబ్ధిదారులు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందిస్తూ ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. పాలకొండ మండలంలోని సింగన్నవలస గ్రామానికి చెందిన లావేటి సావిత్రి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో వలంటీర్ లక్ష్మీబాయి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ డబ్బులు రూ.3 వేలు అందజేశారు. అలాగే పాలకొండ పట్టణంలోని శ్రీరామా కళామందిర్ సచివాలయ పరిధిలో నివాసముంటున్న పింఛన్ లబ్ధిదారు కొట్టిశ నిర్మల అనారోగ్యంతో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో.. వలంటీరు మైనపు ధనలక్ష్మి ఆదివారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు.

వీరఘట్టంకు చెందిన ఇద్దరు పింఛన్‌దారులు అనారోగ్యంతో బాధపడుతూ.. శ్రీకాకుళంలోని బంధువుల ఇంటి వద్ద ఒకరు, జెమ్స్ ఆస్పత్రిలో ఒకరు చికిత్స పొందుతున్నారు. వలంటీర్లు బి.దేవి, పి.పరశురాం ఆదివారం శ్రీకాకుళం వెళ్లి పింఛన్ డబ్బులు అందజేయడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మూలజమ్ము గ్రామానికి చెందిన కొండగొర్రి మంగులు(42) చెట్టుపైనుంచి జారిపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగులు శనివారం ఉదయం చింతబొట్టలు ఏరేందుకు చింత చెట్టు ఎక్కాడు. కాలుజారడంతో కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే భద్రగిరి సీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి, అక్కడ నుంచి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పరిస్థితి మెరుగుపడకపోవడంతో ఆదివారం సాయంత్రం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య సుబ్బలక్ష్మి, కుమారులు జీవన్, దిలీప్ ఉన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం..



వీరఘట్టం: వండవలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కళావతి



పాలకొండ: చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



పాలకొండ రూరల్: అంపిలిలో చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేస్తున్న వైస్ ఎంపీపీ అనీల్‌కుమార్



సీతంపేట: పెద్దూరులో పోలియో డ్రాప్స్ వేస్తున్న సర్పంచ్ ఆదిలక్ష్మి



భామిని: బాలేరులో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి దీపికారాణి



గరుగుబిల్లి: బస్టాండ్ ఆవరణంలో చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేశారు. వీరఘట్టం మండలం వండవలో ఎమ్మెల్యే కళావతి, పాలకొండ పట్టణంలోని ముదునూరువారి వీధిలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేశారు. తొలిరోజు సుమారు 90 శాతం మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో డ్రాప్స్ వేయనున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



గుమ్మలక్ష్మీపురం: నెల్లికిక్కువలో చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేస్తున్న డీఐఓ డాక్టర్ ఎం.నారాయణ



కురుపాం: కురుపాంలో చిన్నారికి డ్రాప్స్ వేస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి, ఎంపీటీసీ స్వామియాజులు



జియ్యమ్మవలస: పెదకుదమలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓలు



కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో పిల్లలకు చుక్కల మందు వేస్తున్న వైస్ ఎంపీపీ సంగిరెడ్డి శరత్‌బాబు